క్లుప్తంగా

పనులు వేగవంతం



హైవే పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాచిపెంట: జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని మడవలస మీదుగా జరుగుతున్న విశాఖ – రాయ్‌పూర్ గ్రీన్ నేషనల్ హైవే పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల ప్రగతిపై ఆరా తీసి, రహదారిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

తీర్మానం రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘ నాయకులు

పార్వతీపురం: బోయవాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీల్లో చేర్చాలని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఆయా సంఘాల ఆధ్వర్యంలో పార్వతీపురం రైతు కూలీసంఘం కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీఓ సి. విష్ణుచరణ్‌కు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రైతు కూలీసంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలు, గిరిజన సంఘ నాయకులు మిన్నారావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు అన్నదానం

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి లెప్రసీ హాస్పిటల్‌లో రోగులు 30మందికి పెదపెంకి గ్రామానికి చెందిన ఈర్ల సంజీవనాయుడు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తన తల్లి స్వర్గీయ సత్తెమ్మ నాల్గవ వర్ధంతి సందర్భంగా రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సంజీవనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఈర్ల కళావతి, ఎం.శ్రీను, ఎస్.భూషణరావు, మధు, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై అవగాహన

సాలూరు: మండలంలోని మావుడి గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) నిర్వహణపై పాచిపెంట మండలానికి చెందిన ఎనిమిది గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మావుడి సర్పంచ్ పీడిక సుదర్శన్, ఎంపీటీసీ సభ్యుడు ఆది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలి వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పార్వతీపురం నుంచి వచ్చే హైపవర్‌లైన్ తీగలపై చెట్ల కొమ్మలు గాలికి పడిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఏఈ సోమేశ్వరరావు తెలిపారు. సిబ్బంది సహకారంతో విద్యుత్ అంతరాయ నివారణకు సత్వర చర్యలు చేపట్టామని తెలియజేశారు.

రేపు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో ఈనెల 29న 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత సంబరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఎం జి.శివున్నాయుడు సోమవారం తెలిపారు. ఆసరా పథకం కింద మండలంలోని 1379 డ్వాక్రా సంఘాలలో ఉన్న 14,383 మంది మహిళలకు మూడో విడతగా ప్రభుత్వం రూ.9.84 కోట్లు విడుదల చేసిందన్నారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చేతులమీదుగా చెక్కు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తున్న సీఐటీయూ నాయకులు

బొబ్బిలి రూరల్: ఫెర్రోఎల్లాయిస్ కంపెనీలకు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పి.శంకరరావు కోరా రు. ఇదే విషయమై మండలంలోని ఎం.బూర్జవలస గ్రామ సచివాలయం వద్ద ధర్నా చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విద్యుత్ బిల్లుల భారంతో పరిశ్రమలు మూతపడ్డాయని, దీంతో పరిశ్రమల్లో పనిచేసే వారంతా ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మరిన్ని పరిశ్రమలు మూతపడకుండా విద్యుత్ చార్జీలు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలం, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కొత్తవలస పంచాయతీ కరకవవలస, జనవరివలస, బొడ్డవలస గ్రామాల్లో సర్పంచ్ ఎస్.ధర్మావతి అధ్యక్షతన ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మంత్రి రాజొన్నదొరకు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లిన రాజన్నదొర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎంత లబ్ధి చేకూరినదీ వివరించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, పోడు పట్టాలు, తదితర అంశాల్లో ప్రజలు తెలియజేసిన సమస్యలను తెలుసుకున్న మంత్రి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల వల్ల ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగనన్నను 2024లో మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, నాయకులు దండి శ్రీనివాసరావు, కల్లేపల్లి త్రినాథ, సంగంరెడ్డి జయసింహ, సువ్వాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జగన్నాథరావు

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారులు, సిబ్బంది పక్కాగా అమలు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాధికారి డాక్టర్ జగన్నాథరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన సీతానగరం మండలం సూరంపేటలో పీహెచ్‌సీ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో 104 సంచార వైద్యకేంద్రంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ముందురోజునే నిర్దేశించిన గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి అందుకు అవసరమైన ప్రణాళికలు తయారుచేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, ప్రీస్కూల్ పిల్లలకు, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందిన వారికి మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. మంచంపై నుంచి లేవలేని వారు ఎంతమంది ఉన్నారనే నివేదికను సిద్ధం చేసుకుని గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గ్రామానికి సంబంధించిన రోగుల వివరాలు దగ్గర ఉన్నపుడే మెరుగైన వైద్యసేవలు అందజేయడానికి వీలవుతుందన్నారు. అనంతరం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పక్కాగా అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రోగులను తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహనరావు

అవసరమైన మందులు అందజేత

వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రోగులకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి వ్యాధి నివారణకు అవసరమైన మందులు అందజేస్తామని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సూరంపేటలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఉచితవైద్య శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఓపీ నిర్వహణ రికార్డులు, రక్తపరీక్షలు, దీర్ఘకాలిక రోగుల వివరాల రికార్డులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గృహసందర్శన చేయడంపై రోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికార సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో గృహ నిర్మాణాలు

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

మక్కువ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన పెంచాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. మూడు వారాల్లో అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.దేవకుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: సీతంపేట ఐసీడీఎస్ పరిధిలో ఉన్న 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ పి.రంగలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురండి, రాజుగాడిగూడ కేంద్రాల్లో పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయా స్థానాలను ఎస్టీలకు కేటాయించారు. అర్హులైన స్థానిక మహిళలు ఈనెల 28 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

గుమ్మలక్ష్మీపురం: సారా కేసుల్లో పట్టుకున్న నాలుగు ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు ఎల్విన్‌పేట ఎస్సై ఎస్.షణ్ముఖరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ ఎస్‌డీపీఓ, ఎల్విన్‌పేట సీఐ సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

24 గంటల్లో సమస్యల పరిష్కారం



చేతి పంపు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజల సమస్యలకు 24గంటల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పరిష్కారం చూపిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని జిమ్మిడివలస గ్రామంలో తాగునీటి సమస్యకు 24 గంటల్లో పరిష్కారం చూపి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జిమ్మిడివలస గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోందని, రచ్చబండ కావాలని గ్రామస్తులు ఆదివారం కోరారన్నారు. దీంతో అధికారులతో మాట్లాడి 24 గంటల్లో సమస్యకు పరిష్కారం చూపి పనులకు సంబంధించి శంకుస్థాపన చేశామని, అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ రాజు, నాయకులు బలగ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దినసరి వేతనం రూ.250 అందేలా ఉపాధి పనులు

భామిని: ఉపాధిహామీ వేతనదారులకు రోజువారీ కనీస వేతనం రూ.250లు వచ్చేలా పనులు కేటాయించాలని ఏపీడీ, సామాజిక తనిఖీ ప్రజావేదిక పరిశీలనాధికారి ఎస్.శ్రీహరి అన్నారు. మండల పరిషత్ వద్ద సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. ఆడిట్ రిపోర్టును చదివి వినిపించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించి వర్క్ డిమాండ్‌లు సిద్ధం చేయాలన్నారు. మస్తర్లలో దిద్దుబాటు ఉంటే విధిగా టీఏ సంతకం ఉండాలన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 939 పనులకు సంబంధించి రూ.9,32,19,700ల వినియోగంపై తనిఖీలు చేపట్టగా.. అందులో వేతనాల కింద రూ.5,96,77,069లు, మెటీరియల్ కోసం రూ.3,35,42,630లు ఖర్చు చేసినట్లు వివరించారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహనబాబు, ఉపాధి ఏపీఓ జి.తులసీదాస్, క్లస్టర్ టీఏ పి.గంగాధర్, ఐకేపీ ఏపీఓ రాణి, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ ఎస్.మీరావల్లి, డీఆర్‌పీలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- పంపిణీ చేస్తున్న ఘనత సీఎం జగనన్నదే
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని జమదాల గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. దీనికి లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలవి అర్థం లేని విమర్శలు

ప్రతి కుటుంబానికి ఏదోఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వైస్‌ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆసరా వేడుకలు విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేరీ

బలిజిపేట: ఈనెల 29వ తేదీన మండలస్థాయిలో నిర్వహించనున్న ఆసరా పథకం లాంచింగ్ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు మేరీ కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీపీఓలు, మహిళా పోలీసులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వెంగాపురంలో మండలస్థాయి ఆసరా పథకం వేడుకలను బుధవారం నిర్వహిస్తామని అందరం కలిసి విజయవంతం చేయాలని కోరారు. మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యేలా చూసి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుమూర్తి, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గడువులోగా ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్ పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన లచ్చయ్యపేటలో ప్రాథమిక పాఠశాలను ఆనుకుని ఉన్న కాలనీలో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణాలు పూర్తి కావచ్చాయని తెలియజేశారు. బోర్లకు విద్యుత్ కనెక్షన్లు సమకూర్చి తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామని, అసంపూర్తిగా ఉన్న లచ్చయ్యపేట వాటర్ ట్యాంక్‌లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, జెడ్పీటీసీ ఎం. బాబ్జీ, ఎంపీటీసీ ఎ.సింహాచలం పాల్గొన్నారు.



లచ్చయ్యపేటలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్‌ట్యాంక్

చెత్త నుంచి సంపద తయారీతో గ్రామాభివృద్ధికి తోడ్పడాలి



కాశీపేటలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ

సీతానగరం: గ్రామాల్లో నెలకొల్పిన ఎస్‌డబ్ల్యూపీసీల్లో (చెత్తనుంచి సంపద తయారు) సేకరించిన తడి చెత్త–పొడి చెత్త ద్వారా పంచాయతీ పాలకులు సంపద తయారుచేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు మండలంలోని కాశీపేటలో గల ఎస్‌డబ్ల్యూపీసీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల ద్వారా రోజు వారీ వేర్వేరుగా సేకరిస్తున్న తడిచెత్త, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలో శుద్ధి చేసి, వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయవచ్చన్నారు. జిల్లాలోని పంచాయతీ పాలకులు చెత్తనుంచి సంపదతయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాలను ప్రోత్సహించాలని వినతి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో జగనన్న గృహనిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బోగి లత కోరారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషాను విజయవాడలో సోమవారం కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించారు. పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని, కొత్త గృహాల నిర్మాణాలను త్వరితగతిన చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. ఆమెతో పాటు వీరఘట్టం పీఏసీఎస్ డైరెక్టర్ భోగి మణి ఉన్నారు.



రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీషాకు వినతపత్రం ఇస్తున్న బోగి లత

ఈదురుగాలులు, కుండపోత

గరుగుబిల్లి: మండలంలోని గరుగుబిల్లి, గొట్టివలస, పెద్దూరు తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు కారణంగా ఉదయం ఎండ, సాయంత్రం వర్షం కురుస్తోంది. అకాల వర్షాల కారణంగా మండలంలోని కొత్తపల్లి, గిజబ, నందివానివలస, సంతోషపురం తదితర గ్రామాల్లో అరటి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

- **కొమరాడ:** మండలంలో గతకొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. కళ్లికోట, దుగ్గి, దళాయపీట, గుణానపురం, విక్రంపురం, పరుశురాంపురం, గంగారేగువలస తదితర గ్రామాల్లో జొన్న, అరటి, నువ్వు పంటలకు నష్టం వాటల్లిందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలను పరిశీలించి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.
- **భామిని:** మండలంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏబీరోడ్డుపై భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సీజన్‌లో ఇదే భారీ వర్షమని పలువురు అంటున్నారు. పలుచోట్ల వీధికాలువల్లో చెత్తపేరుకుపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి ప్రవేశించింది. మండల వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో ప్రజలు అల్లాడుతున్నారు.



భామిని: బాలేరు వద్ద రోడ్లుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



భామిని: నేరడిలో కురుస్తున్న వర్షం



గరుగుబిల్లి: గొట్టివలసలో కురుస్తున్న వర్షం